క్లుప్తంగా

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



కంకిపాడు: రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని వేల్పూరు సర్పంచ్ చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ తెలిపారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో రీ సర్వే ప్రక్రియ శనివారం నుంచి చేపట్టారు. శివనాగేంద్రమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ భూములను రీ సర్వే చేయించుకుని సంపూర్ణ హక్కులను పొందాలన్నారు. మాజీ సర్పంచ్ చెన్నుబోయిన జయరాం, ఈడే వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బూసిమ్మతల్లి తిరునాళ్లు



ఉయ్యూరు: బూసిమ్మతల్లి తిరునాళ్లు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మండలంలోని ముదునూరు గ్రామంలో వేంచేసి ఉన్న కూరాకుల వంశస్తుల ఇలవేల్పు బూసిమ్మతల్లి తిరునాళ్లు 15 రోజులు పాటు నిర్వహిస్తారు. ఈ తిరునాళ్లలో భాగంగా శనివారం భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కూరాకుల, పల్లపోతు వంశస్తులు విశేష పూజలు జరిపించి ఉత్సవాలను పర్యవేక్షించారు. ఆదివారం శిడిబండి ఉత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థుల ఎంపిక



ఉంగుటూరు:ప్రముఖ కంపెనీలైన హుండాయి, కియో మోటర్స్ సంస్థల్లో 34 మంది ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవీ కేఎస్వీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సంస్థల ప్రతినిదులైన సుధాకర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ రాంబ్రహ్మం, డైరెక్టర్ కె.రాజశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

ప్రగతి పథంలో పునాదిపాడు

- రూ.2.07 కోట్లతో అభివృద్ధి పనులు
- అందుబాటులోకి వస్తున్న ప్రభుత్వ భవనాలు
- మెరుగుపడుతున్న మౌలిక సౌకర్యాలు

కంకిపాడు: ప్రభుత్వ భవనాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. మౌలిక వసతులు కల్పనతో ప్రజల ఇక్కట్లు తీరుతున్నాయి. అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులు ఊపందుకోవటంతో పునాదిపాడు ప్రగతి పథంలో పయనిస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ఈ క్రమంలో పునాదిపాడు పంచాయతీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. ప్రభుత్వ మార్గదర్శకాలు, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సహకారంతో గ్రామంలో వసతుల కల్పన శరవేగంగా జరుగుతుంది.

శరవేగంగా అభివృద్ధి పనులు

గడిచిన మూడున్నరేళ్లలో గ్రామంలో రూ 2.07 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. రూ.85లక్షల అంచనా వ్యయంతో రెండు సచివాలయ భవనాలు నిర్మాణం చేపట్టారు. ఒకటో సచివాలయం ఇప్పటికే ప్రారంభమవగా, రెండో సచివాలయ భవనం నిర్మాణం తుదిదశలో ఉంది. రూ.25 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.18 లక్షలతో హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తిచేశారు. బీసీ కాలనీలో రూ.10 లక్షలు, ఎస్టీ కాలనీలో రూ.5 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీహాలుకు రూ.5 లక్షలతో మరమ్మతులు చేశారు. బీసీ కాలనీలో డ్రెయిను, రోడ్డు నిర్మాణానికి రూ.4 లక్షలు, బీసీ కాలనీ, జెడ్పీ పాఠశాల రోడ్డు, ఎస్సీ కాలనీలో అంతర్గత రహదారులు, సిమెంటు రోడ్ల నిర్మాణ పనులకు రూ.30.50 లక్షలు వెచ్చించారు. బీసీ కాలనీలో తాగునీటి వసతులను మెరుగుపరిచేందుకు బోరు, మోటరు ఏర్పాటు పనులను రూ.4 లక్షల అంచనాతో చేపట్టారు.



ఎస్సీ కాలనీలో నిర్మితమైన సిమెంటు రోడ్డు



తుదిదశకు చేరిన పునాదిపాడు-2 సచివాలయ భవనం నిర్మాణ పనులు

కొత్త కాలనీలో వసతుల కల్పన

గ్రామంలో పేదలకు కేటాయించిన కొలుసు పార్థసారథి కాలనీ (కొత్త కాలనీ)లో మౌలిక వసతుల కల్పన చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే రూ.10 లక్షలు అంచనాతో అంతర్గత రహదారుల అభివృద్ధి పనులను పూర్తి చేశారు. రూ.5 లక్షలతో పైపులైను ఏర్పాటుచేసి తాగునీటి వనరులను మెరుగుపరిచారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి



అందరి సమన్వయం, సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నాం. ప్రభుత్వ కార్యాలయాల ద్వారా సేవలు పూర్తి స్థాయిలో అందేలా చూస్తున్నాం. మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా పాలకవర్గం కృషి చేస్తోంది. అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నాం.

– మునిబోయిన విజయకుమారి, సర్పంచ్, పునాదిపాడు

గోసాలలో రోడ్డుకు మోక్షం

గడప గడపలో వచ్చిన సమస్యకు పరిష్కారం

పెనమలూరు: గోసాలలో దీర్ఘకాలంగా అభివృద్ధి చెందని రోడ్డుకు ఎట్టకేలకు శనివారం మోక్షం లభించింది. గ్రామంలో వైకుంఠపురం పాఠశాల పక్కన ఉన్న రోడ్డును రియల్ వ్యాపారులు గ్రామ పంచాయతీకి చాలా సంవత్సరాల క్రితం దఖలు చేశారు. అయితే రోడ్డు అభివృద్ధి చేయటానికి వివాదం సృష్టించటంతో అభివృద్ధికి నోచుకోలేదు. అయితే ఇటీవల ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా వైకుంఠపురం వచ్చిన సమయంలో స్థానికులు రోడ్డు వేయాలని ఆయనను కోరారు. ఈ వివాదం పై ఎమ్మెల్యే ఆదేశంతో రెవెన్యూ అధికారులు పరిశీలించి రోడ్డు వేయటానికి అంగీకారం తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో రబ్బీష్‌తో రోడ్డు నిర్మాణం పనులు శనివారం గ్రామ సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. చాలా సంవత్సరాల తరువాత రోడ్డు సమస్య పరిష్కారమై అభివృద్ధి పనులు చేయట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



గోసాలలో రోడ్డు వేస్తున్న దృశ్యం

చలివేంద్రం ప్రారంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: వేసవిలో ఎండ తీవ్రతకు పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు వీలుగా చలివేంద్రం ఏర్పాటు చేయటం హర్షణీయమని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద సమాచార హక్కు చట్టం ప్రచార సమితి అమరావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. తొలిరోజు చలివేంద్రంలో మజ్జిగ ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, సమాచార హక్కు చట్టం ప్రచార సమితి అధ్యక్ష, కార్యదర్శులు కోటా సురేష్, షేక్ కరీం, మండల అధ్యక్షుడు కాలి కిరణ్ పాల్గొన్నారు.

యనమలకుదురులో ఈద్గా వివాదం

పెనమలూరు: యనమలకుదురులో ఈద్గా, కబరస్తాన్ కమిటీ వ్యవహారం మరలా వివాదంగా మారింది. ఇటీవల కొత్త కమిటీ వేయగా ఈద్గా నిర్వహణలో మరో వర్గం ముందుకు రాక పోవటంతో కొత్తగా వివాదం తలెత్తింది. యనమలకుదురులో ఈద్గా గతంలో ఓ వ్యక్తి ఆధీనంలో ఉండేది. అయితే గ్రామంలో ఉన్న మిగాతా ఐదు మసీదులకు చెందిన వారు ఈద్గా నిర్వహణలో అందరికీ ప్రాధాన్య కల్పించాలని కోరారు. దీంతో వివాదం తలెత్తడంతో తాడిగడప మున్సిపాలటీ కమిషనర్ సమక్షంలో ఈద్గా కమిటీ ఎన్నికలు నిర్వహించగా గ్రామంలో అన్ని మసీదులకు చెందిన వారు షేక్. మౌలాలీ అధ్యక్షుడిగా కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అయితే రెండవ వర్గం దీనికి అంగీకరించలేదు. ఈద్గా వద్ద ఉన్న షాపుల నిర్వహణతో పాటు జమాఖర్చుల విషయంలో ఇప్పుడు మరలా వివాదం వచ్చింది. దీంతో కొత్త కమిటీ సభ్యులు ఈద్గా ఆవరణలో నిరసన దీక్ష చేపట్టారు.

నేడు దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరుగుతుంది. లోక కళ్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం ఈ సేవ నిర్వహిస్తారు. సేవలో పాల్గొనే వారు ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్‌లో తగిన రుసుం చెల్లించి సేవా టికెట్లు పొందవచ్చు. సేవలో పాల్గొనే భక్తులకు ప్రత్యేక క్యూలో అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు.

పథకాలతో మైనార్టీలకు ఆర్థిక భరోసా

గడప గడపకు మన ప్రభుత్వంలో లబ్ధిదారుల ఆనందం

పెనమలూరు: జగనన్న పాలనలో ముస్లిం మైనారిటీలకు న్యాయం జరుగుతుందని, ఆయన తమ కుటుంబాలను పూర్తిగా ఆదుకున్నారని పలువురు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శనివారం సనత్‌నగర్‌లో పర్యటించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందచేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎండి.అదురున్నీసా, షేక్.నూర్జహాన్ మాట్లాడుతూ ప్రభుత్వం తమకు ఆసరా, అమ్మ ఒడి, విద్యాదీవెన, పింఛన్ ఇలా అనేక సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఆదుకుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా మైనారిటీల సంక్షేమాన్ని పట్టించుకోలేదని తెలిపారు. నేడు తమ పిల్లలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చదువుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు. సనత్‌నగర్ ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణం చేయాలని, డ్రైనేజీల పూడిక తీత తీయించాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదం లేకుండా చేయాలని, దోమలు నివారించాలని కోరారు.

సమస్యలు పరిష్కరిస్తా....

సనత్‌నగర్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సనత్‌నగర్‌లో అనేక రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేశామన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ సిబ్బందిని ఆదేశించారు. తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, మాజీ సర్పంచ్ అన్నే చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు చాంద్‌బాషా, ఖాదర్, పఠాన్ అహ్మద్, ఉయ్యూరు మార్కెట్‌యార్డు చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, నేతలు అజీజుల్లా, రెహమాన్, లతీఫ్, నేరెళ్ల బుజ్జి, అహ్మద్, రజాక్, తాళ్ల నరేంద్ర, వేమూరి బాలకృష్ణ, అన్నే శ్రావణ్, ఈదా రాజేష్, తుమ్మల వరదీష్, యాసీన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కానూరు సనత్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

90 మంది వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు

కంకిపాడు: కంటి వెలుగుతో కంటి సమస్యలు పూర్తిగా దూరమవుతాయని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శనివారం చేపట్టారు. 90 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి పలువురికి మందులు పంపిణీ చేశారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధుల కంటి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఎల్‌హెచ్‌పి బి.జయశ్రీ, ఏఎన్ఎం పి.శైలజ, ఆశ కార్యకర్తలు జె.శమంతకమణి, కె.రమాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పునాదిపాడులో కంటిపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్

డ్వాక్రా మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ

తొలిదశలో 60 యూనిట్లు

పెనమలూరు: ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కానూరులో డ్వాక్రా మహిళలకు శనివారం పెరటి కోళ్లు పంపిణీ చేశారు. యూనిట్‌కు రూ.3970 డ్వాక్రా మహిళలు చెల్లిస్తే 11 కోళ్లు ఇస్తారు. ఇందులో 8 పెట్టలు, 3 పుంజులు ఉంటాయి. ఒకో కోడి దాదాపు కిలో బరువు ఉంటుంది. ఇవి నాలుగు నెలల్లో గుడ్లు పెడతాయి. ఈ గుడ్లు తినటం వలన మహిళల్లో రక్తహీనత తగ్గించవచ్చు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు గుడ్లు తినటం వలన అధిక ప్రొటీన్లు చేకూరుతుంది. డ్వాక్రా మహిళలు పెరటి కోళ్లు పెంచటానికి మొదటి విడతగా మండలంలో 60 యూనిట్లు గ్రౌండ్ చేశామని ఏపీఎం నాగభూషణం తెలిపారు. త్వరలో మరిన్ని యూనిట్లు గ్రౌండ్ చేస్తామన్నారు. డ్వాక్రా మహిళలు పెరటి కోళ్లు పెంపకానికి ముందుకు రావాలని సూచించారు.



పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

రామవరప్పాడు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సీమాట్ (ఎస్ఐఈఎంఏటీ) డైరెక్టర్ మస్తానయ్య కోరారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులు, వారి వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. మస్తానయ్య మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని కోరారు. కష్టతరమైన పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా ఇప్పటి నుంచే విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. మంచి ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. వెనుక బడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సీమాట్ ప్రొఫెసర్లు మహేశ్వరరెడ్డి, రామ అరుణ, శారద, ఎస్ఎస్ఏ ఏఎంవో బట్టు సురేష్‌కుమార్, సీఎంవో తోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్


మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ కోరారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్, కియా మోటారు కంపెనీ, ఇండియూ పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డెవలప్ రెస్పాన్సిబుల్ అవుట్‌లుక్ ఫర్ ప్లాస్టిక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా కమిషనర్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ప్లాస్టిక్ వృథాను అరికట్టేందుకు సహకరించాలని కోరారు. నగరంలో వేస్ట్ మేనేజ్‌మెంట్ వివరాలను విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, అడిషనల్ కమిషనర్ కె. వెంకట సత్యవతి మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అసోసియేషన్ ప్రతినిధి కౌషికా శరవణన్ మాట్లాడుతూ వేస్ట్‌మేనేజ్‌మెంట్‌పై వచ్చే 11 నెలల్లో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లకు 200 వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేస్ట్‌మేనేజ్‌మెంట్‌పై ప్రచారం ద్వారా ప్రజలలో అవగాహన పెంపొందిస్తామన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ జీ నాగార్జున, డాక్టర్ కె.రమేష్ తదితరులున్నారు.



డ్రాప్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్

సందడిగా సితార్-2023

పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం సితార్ సందడిగా జరిగింది. కాలేజీలో జాతీయ స్థాయిలో టుక్‌ఫెస్టు సితార్-2023 రెండవ రోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అట్టహాసంగా జరిగింది. వివిధ కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు ఆటపాటలు, డ్యాన్స్‌లతో సందడి చేశారు. విద్యార్థులకు సాంస్కృతిక, సాహిత్య పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో దాదాపు 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రతిభ చాటారని పేర్కొన్నారు.



గ్రూప్ డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

మునగాకుతో గర్భిణులకు భోజనం

విజయవాడరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు మునగాకు కలిపి భోజనం అందించాలని కంకిపాడు ప్రాజెక్ట్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి బేబి సుకన్య తెలిపారు. ఈ మేరకు గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లకు శుక్రవారం ఆమె సమాచారం పంపించారు. మునగాకులో రక్తం వృద్ధి చేందే పోషక విలువలున్నందున తప్పనిసరిగా వంట చేసి అందించాలని సూచించారు. పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు పోషక విలువలున్న మునగాకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి వారంలో బుధవారం వరకు ఎగ్ కర్రీ ఉంటుందని, గురువారం ఎగ్‌ఫ్రైడ్ రైస్ అందిస్తామన్నారు. శుక్రవారం సొరకాయ లేదా దోసకాయ శనివారం వెజిటబుల్ రైస్ వడ్డిస్తామని తెలిపారు. పిల్లలకు ఎగ్‌తో పాటు మిరియాల పొడి కలిపి ఇస్తున్నామన్నారు.

నేడు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం

గన్నవరం: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో ఆదివారం ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి బి.చంద్రలీల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల్లోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో బీఎల్వోలు ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఫారం 6బి ద్వారా ఓటరుకార్డుతో ఆధార్‌తో పాటు ఇతర గుర్తింపు కార్డులతో అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దోపిడీ ఘటనపై కేసు నమోదు

కంకిపాడు: చంపుతామని బెదిరించి నగదు దోపిడీ చేసిన ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు...మండలంలోని మద్దూరు గ్రామ పరిధిలో కరకట్టపై ఉన్న పెట్రోలు బంకు వద్ద ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు పెట్రోలు బంకులోకి వెళ్లి బంకులో పనిచేస్తున్న వీరంకి శ్రీనివాసరావును కొట్టి చంపుతామని బెదిరించి అతని వద్ద ఉన్న రూ.30 వేలు నగదు దోపిడీ చేశారు. ఈ ఘటనపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలని వినతి

విజయవాడరూరల్: గొల్లపూడి-అవుటుపల్లి నేషనల్ హైవే బైపాస్‌కు సర్వీసు రోడ్డు నిర్మించాలని నున్న, విలేజి కుందావారి కండ్రిక, పాతపాడు, అంబాపురం, జక్కంపూడి గ్రామాల రైతులు నేషనల్ హైవే రీజనల్ ఆఫీసర్ (ఆర్ఓ) ఆర్‌కె. సింగ్‌ను శనివారం కలిసి వినతి పత్రం అందచేశారు. బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా రైతులు ఆయన్ను కలిశారు. విజయవాడ నగరానికి అర కిలోమీటరు దూరంలో వున్న తమ గ్రామాలు సీఆర్‌డీఏ ప్రణాళికలో రెసిడెన్షియల్ జోన్‌గా ఉందన్నారు. నేషనల్ హైవే నిర్మాణానికి భూములిచ్చి సహకరించిన రైతులకు సర్వీసు రోడ్డును నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు వస్తే సర్వీసు రోడ్డు నిర్మించడానికి సహకరిస్తామని ఆర్వో ఆర్‌కె సింగ్ తెలిపారు. బైపాస్ రోడ్డు ఎలైన్‌మెంట్‌లో సర్వీసు రోడ్డు లేదన్నారు. ఆర్వోను కలిసిన వారిలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, నున్న సొసైటీ చైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి, డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, కండ్రిక సొసైటీ చైర్మన్ మూళగోళ్ళ రవీంద్రరెడ్డి, రైతులు కుర్రె రామిరెడ్డి, నరిసింహారెడ్డి తదితరులున్నారు.

సనత్‌నగర్ మసీదులో చోరీ

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు మసీదులో చోరీకి పాల్పడ్డారు. మసీదు కమిటీ తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ జెండా చెట్టు ప్రాంతంలో ఉన్న ఆస్తాన-ఎ-గౌస్ ఆజం మసీదు తలుపు తాళాలు గుర్తు తెలియని దొంగలు శుక్రవారం రాత్రి పగులకొట్టి మసీదులోకి ప్రవేశించి మసీదులో ఉన్న బీరువా, ఇతర సామగ్రి చిందరవందరగా పడవేశారు. మసీదు బయట జెండాచెట్టు వద్ద ఉన్న కానుకలు వేసే హుండీ ధ్వంసం చేశారు. గతంలో కూడా ఈ మసీదులో దొంగలు చోరీ చేయటంతో విలువైన వస్తువులు మసీదులో ఉంచలేదు. దీని కారణంగా కొద్ది మొత్తం సొమ్ము మాత్రమే చోరీ జరిగింది. మసీదు ప్రాంతంలో రాత్రి సమయాల్లో పోలీసులు గస్తీ తిరగాలని వైఎస్సార్ సీపీ నేత, మసీదు కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఖాదర్ కోరారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.



మసీదులో బీరువా ధ్వంసం చేసిన దొంగలు